
పీఎం హోం ఆవరణలోగల పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


భాగ్యనగర్‌కాలనీ నాగదేవత పుట్ట వద్ద పూజలో పాల్గొన్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బి. మహేందర్‌యాదవ్ దంపతులు


కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు


పుట్టలో పాలు పోయడానికి బారులు తీరిన భక్తులు


భాగ్యనగర్ కాలనీలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

# భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

## ఆలయాల్లో పూజలు.. పుట్టలో పాలుపోసిన భక్తులు

ఎల్బీనగర్/చంపాపేట్/మన్సూరాబాద్/ఓల్డ్‌మలక్‌పేట/సైదాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) నాగుల పంచమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం ఉదయమే ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ హోం ఆవరణలోని పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించి పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. కర్మన్‌ఘాట్ భాగ్యనగర్‌కాలనీలోని అమ్మవారి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పక్కనే ఉన్న పుట్టలో పాలు పోశారు. హయత్‌నగర్ పాత రోడ్డులోని నాగదేవత ఆలయం, మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయం, ఆర్‌టీసీ కాలనీలోని సాయిబాబా ఆలయం, ఇంజాపూర్‌లోని శివాలయం, వీరన్నగుట్ట ఆలయాలు భక్తులతో కిటకిటడాయి. ఉదయం నుంచే మహిళలు నాగదేవత ఆలయాలకు చేరుకుని పుట్టలో పాలు పోసి మొక్కులఉ చెల్లించుకున్నారు. హయత్‌నగర్ పెద్ద మసీదు వెనుకాల ఉన్న నాగదేవత ఆలయంలో కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో భక్తులు నాగదేవతకు పూజలు చేసి, పుట్టలో పాలు పోశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారారోడ్డులోని పోచమ్మ ఆలయంలోని నాగదేవతకు క్షీరాభిషేకం చేశారు. ఓల్డ్‌మలక్‌పేట మున్సిపల్ కాలనీలోగల పోచమ్మ ఆలయంలోగల పుట్టలో భక్తులు పాలుపోసి నైవేద్యంగా పేలాలు సమర్పించారు. సైదాబాద్ రెడ్డిబస్తీ నాగులమ్మ దేవాలయం, శంకేశ్వర్ బజార్‌లోని శంకేశ్వరాలయం, సైదాబాద్ కాలనీ రామాలయం, వినయ్‌నగర్ విజయ వినాయక దేవాలయం, ఇంద్రప్రస్థకాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయాల ఆవరణలో, లక్ష్మీనగర్ కాలనీ పార్కు నాగదేవత ఆలయంలో పుట్ట వద్ద మహిళలు పూజలు చేసి పాలు పోశారు.


నాగులమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించిన కమిటీ సభ్యులు


హయత్‌నగర్‌లో నాగదేవత ఆలయాన్ని సందర్శించిన కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

## ప్రజల సంక్షేమమే ధ్యేయం : కార్పొరేటర్

మన్సూరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి):ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా మంగళవారం సింధూర్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల విన్నపం మేరకు విజయవాడ జాతీయరహదారిపై పర్యటించారు. ఆయన మాట్లాడుతూ షా గౌస్ హోటల్ వారు రోడ్డు ఆక్రమించడంతో ట్రాఫిక్ సమస్యలతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. నిరుపయోగంగా ఉన్న సైకిల్ ట్రాక్‌ను తొలగించాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు. అధికారులు సమస్యలు పరిష్కరించకపోతే కాలనీ సంక్షేమ సంఘాలతో ధర్నా చేస్తామని నర్సింహారెడ్డి హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ డీఈ నీలిమ, సింధూర్ ఎన్‌క్లేవ్ హైరైజ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరామ్, కార్యదర్శి జేవీ సారధి, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

## కాలనీల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు

కొత్తపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం జలమండలి జీఎం బలరామరాజు, డీజీఎం రవీంద్రనాథ్ వర్మ, ఏఈ స్రవంతిరెడ్డితో కలిసి రాఘవేంద్ర కాలనీ, న్యూ నాగోల్ కాలనీల్లో డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. రాఘవేంద్ర కాలనీలో సమస్యకు పైప్‌లైన్ ఇళ్ల మధ్య ఉండడం, ఔట్‌లెట్ లేకపోవడం ప్రధాన కారణమని జీఎం బలరామ రాజు పేర్కొన్నారు. న్యూ నాగోల్‌లో రోడ్ నెం.1, 2లో మురుగు దారులపై ప్రవహిస్తోందని సమస్యను పరిష్కరించాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. న్యూ నాగోల్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి. రాజేందర్ రెడ్డి(పీఎంఆర్ రాజు), బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


ఎంటమాలజీ సిబ్బందికి పీపీఈ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

## ఎంటమాలజీ సిబ్బందికి పీపీఈ కిట్లు పంపిణీ

వనస్థలిపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎంటమాలజీ సిబ్బంది ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని బీఎన్ రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. మంగళవారం సిబ్బందికి పీపీఈ కిట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ గురువారం గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వాసుపత్రుల్లో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఐఎం మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు షఫియుద్దీన్ సూచించారు. మంగళవారం మలక్‌పేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన ఆరోగ్య సమితి సమావేశం జరిగింది. హైదరాబాద్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజున్నీసా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు ప్రతీ గురువారం ఏఎన్‌సీ చెకప్ చేస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులపై ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో మలక్‌పేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరుణి, పీహెచ్‌ఎన్‌ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయంలో ఇన్‌స్పెక్టర్ పూజలు

చంపాపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): భూపేష్‌గుప్తానగర్ కాలనీలోగల పోచమ్మ ఆలయంలో మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌కుమార్ నాయక్ మంగళవారం పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

కొత్తపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ రాచపుడి అన్నారు. మంగళవారం బాలాపూర్‌లో ఓ ప్రైవేటు స్కూల్ విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. వారికి వీడియోలు, రైమ్స్ ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీటు బెల్టు ప్రాధాన్యతను వివరించారు.

### 45 మంది మందుబాబులకు కౌన్సెలింగ్

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 45 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చారు.

## శాస్త్రోక్తంగా గరుడ హోమం

కొత్తపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): స్నేహపురి పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా గరుడ హోమం నిర్వహించారు. అర్చకులు పద్మావతీ అమ్మవారికి, గరుత్మంతుడికి నవకలశ అభిషేకాలు చేశారు.

## ఘనంగా ఘటాలు, ఫలహారం బండ్ల ఊరేగింపు


సలీంనగర్‌లో ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఎల్బీనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలలో భాగంగా సరూర్‌నగర్‌లో ఫలహారం బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలలో తొట్టెల, ఫలహారం బండ్ల ఊరేగింపు సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బీఆర్ఎస్ యువజన నాయకుడు దర్పల్లి మానస్ ఆధ్వర్యంలో ఫలహారం బండి ఊరేగింపులో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్పల్లి అశోక్, బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండు ధనంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన ఫలహారం బండి, ఘటాల ఊరేగింపులో తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ చంపాపేట అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్: మలక్‌పేట సలీంనగర్‌లో టీపీసీసీ నేత, మాజీ కార్పొరేటర్ చెకోలేకర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రముఖ సినీనటి జయప్రద, ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. మహిళల సామూహిక బోనాల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాబృందాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


మన్సూరాబాద్: నాగోల్, మన్సూరాబాద్ డివిజన్లలో ఘటాలు, ఫలహారం బండ్ల ఊరేగింపును సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, నాగోల్ డివిజన్ జైపురి కాలనీలో నిర్వహించిన ఫలహారంబండి ఊరేగింపులో బీజేపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌నాథ్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.




ఫలహారం బండ్ల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సినీ నటి జయప్రద, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

## స్వర్ణగిరి ఆలయ నమూనాలో బాలాపూర్ గణేశ్ మండపం

సరూర్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏడాదికో కొత్త రూపంలో రూపుదిద్దుకునే బాలాపూర్ గణేశ్ మండపాన్ని ఈసారి స్వర్ణగిరి ఆలయ నమూనాతో ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది అయోధ్య రామ మందిరం ఆలయ నమూనాలో మండపం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది భువనగిరి సమీపంలోని స్వర్ణగిరి టెంపుల్‌ను పోలిన విధంగా బాలాపూర్ మండపాన్ని తయారు చేస్తున్నారు. మండప నిర్మాణానికి గతంలో బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి శాశ్వత షెడ్డు నిర్మించారు. ప్రస్తుతం స్వర్ణగిరి నమూనా కోసం షెడ్డును తొలగించారు. మండపం పనులను డిజైనర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. విగ్రహం తయారీ పనులు రెండురోజుల క్రితం ధూల్‌పేట్‌లో ప్రారంభమయ్యాయని తెలిపారు.


బాలాపూర్ గణేశ్ మండపం కోసం తయారు చేసిన స్వర్ణగిరి ఆలయ నమూనా

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ హెచ్చరిక

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం డివిజన్ స్థాయి అధికారుల సమీక్ష సమావేశం మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో శివ గార్డెన్‌లో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. గ్రామ స్థాయిలో తక్కువ పనితీరు కనబర్చిన 15 మంది పంచాయతీ కార్యదర్శులు, ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్‌లు, 15 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని అధికారులు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల అభివృద్ధి అధికారి శ్రీవాణి, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, మాడ్గుల మండలాల ఎంపీడీవో, పంచాయతీ, మిషన్ భగీరథ ఏఈ, ఏపీవో, ఈసీ, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారులు

### ఎన్నికలు ఎప్పుడు వచ్చినా
## బీజేపీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి

సరూర్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి):ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ సూచించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ క్లస్టర్-1 కమిటీ సభ్యులు అధ్యక్షుడు ఆర్.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నాదర్‌గుల్‌లో శ్రీరాములును పార్టీ కార్యాలయంలో కలిశారు.

### క్లస్టర్-1 కార్యవర్గం

అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.అరవింద్‌కుమార్, జి.పద్మారావు, సైదులు, నర్మద, ప్రధాన కార్యదర్శులుగా కె.మురళీధర్ రెడ్డి, ఆర్.మల్లేశ్, కార్యదర్శులుగా ఎం.ప్రవీణ్‌గౌడ్, పి.పద్మజ, ఎస్.రాంచందర్, చైతన్య, కోశాధికారిగా అర్చన, సభ్యులుగా కె.కుమార్, వి.మౌనిక, సీహెచ్ స్నేహ, ఎం.మహేందర్, బి.అభిలాష్‌రెడ్డి, ఎస్.లక్ష్మణ్, బి.గణేశ్, జి.మధుతేజ, డి.సంతోషిని ఎన్నుకున్నారు.

## యువకుడిపై కత్తులతో దాడి

సైదాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి):యువకుడిపై దుండగులు కత్తులతో దాడి చేసి పారిపోయారు. వాహెద్‌నగర్‌కు చెందిన మహ్మద్ రవూఫ్(32) దుస్తుల షాపులో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి సోదరుడితో కలిసి ఇంటి సమీపంలో నిలబడ్డాడు. చావునికి చెందిన పాషా అనుచరులతో వచ్చి రవూఫ్‌పై కత్తులతో దాడిచేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మాదన్నపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడికి ఆర్థిక లావాదేవీలు కారణమై ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

మన్సూరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఓరుగంటి వేణుమాధవ్, వాసవీక్లబ్ డీపీఓ మొరిశెట్టి సంతోష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితారెడ్డి, ఉపాధ్యాయులు, గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం సభ్యులు రంగ శ్రీధర్, తాటిశెట్టి పశుపతి తదితరులు పాల్గొన్నారు.

## లెప్రసీ సమస్యలు మానవ హక్కుల కమిషన్ దృష్టికి

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): లెప్రసీ సమస్యలను సొసైటీ ఆఫ్ లెప్రసీ ఎఫెక్టెడ్ పర్సన్స్ (స్లాప్) జాతీయ మానవ హక్కుల కమిషన్ సుబ్రమణ్యం దృష్టికి తీసుకెళ్లింది. స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు మనియాద రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం మర్రి చెన్నారెడ్డి హెచ్‌ఆర్‌డీఐకి వచ్చిన సుబ్రహ్మణ్యంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్‌పీడీవో శ్రీనివాస్, గుత్తికొండ కిరణ్, వెంకట్‌రెడ్డి, మల్లేష్, శివతో పాటు పలువురు ఉన్నారు.


జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ తదితరులు


మినీ ఆడిటోరియం నిర్మాణ పనులపై అధికారులతో చర్చిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

## వనస్థలిపురంలో మినీ ఆడిటోరియం

● త్వరలో పనులు ప్రారంభం : జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్

వనస్థలిపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంలో మినీ ఆడిటోరియం నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. మంగళవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి వనస్థలిపురంలో పలు కాలనీల్లో పర్యటించి కాలనీలవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఓపెన్ హుడా ఆడిటోరియం వద్ద కమిషనర్ మాట్లాడుతూ మినీ ఆడిటోరియం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎల్బీనగర్ సర్కిల్-4డీసీ మల్లికార్జున రావు, పలు విభాగాలు అధికారులు పాల్గొన్నారు.

## పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా భీమేశ్



సరూర్‌నగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) రాష్ట్ర కమిటీ సభ్యుడిగా బాలాపూర్‌కు చెందిన కొల్లూర్ భీమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

## నాగోల్ ఇన్‌స్పెక్టర్‌గా మక్బూల్ జానీ

మన్సూరాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మక్బూల్ జానీ నియమితులయ్యారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నాగోల్ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న ఎ.సూర్యానాయక్‌ను ఆర్థిక నేరాల విభాగం(ఈఓడబ్ల్యూ)కు బదిలీ చేశారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఉద్యమకారుల ఫోరం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇచ్చిన హామీ మేరకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులు నక్క శివలింగంగౌడ్, జంగయ్యగౌడ్, టీయూఎఫ్ పెద్దఅంబర్‌పేట్ మునిసిపల్ అధ్యక్షుడు జోర్క రాముముదిరాజ్, తుర్కయంజాల్ మున్సిపల్ అధ్యక్షుడు బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఎల్బీనగర్ కానిస్టేబుల్ మృతి


నల్ల ప్రదీప్(ఫైల్)

కొత్తపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఎల్బీనగర్ కానిస్టేబుల్ మృతిచెందాడు. దేవరకొండ ముదిగొండ గ్రామానికి చెందిన నల్ల ప్రదీప్ భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి ఎస్‌బీహెచ్ కాలనీలో ఉంటూ ఎల్బీనగర్ క్రైమ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో టిఫిన్ చేస్తూ అకస్మాత్తుగా కిందపడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆయనను సమీపంలోగల శ్రీకర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్, ఎస్‌ఐలు ప్రదీప్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఆడుకుంటూ గాయపడిన బాలుడి మృతి

చంపాపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఆడుకుంటూ గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. హాఫీజ్‌బాబానగర్‌లో సీ-బ్లాక్‌లో నివసిస్తున్న ఇర్ఫాన్ కుమారుడు షేక్ రహాన్(5) ఆదివారం ఇంట్లో మొదటి అంతస్తులో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలవడంతో కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి..

చాదర్‌ఘాట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉస్మాన్‌పురాలో ముస్లిం మెటర్నిటీ ఆస్పత్రి వద్ద ఈనెల 25న గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అతడిని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.